క్లుప్తంగా

31న గోశాలలో గరుకు స్తంభం ప్రతిష్ఠాపన

తాండూరు టౌన్: గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో గోశాలలో ఈ నెల 31న గరుకు స్తంభం ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్తంభాన్ని నెలకొల్పడం వలన పితృ దేవతలకు స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని, తరతరాలుగా కుటుంబాన్ని వెంటాడుతున్న పాప దోశాల నుంచి విముక్తి పొందవచ్చునని పేర్కొన్నారు. గోశాలలో మొత్తం ఐదు గరుకు స్తంభాలను ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు భక్తులు తమ వంతు సహకారం అందజేయవచ్చునని కోరారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా వీరేందర్‌రెడ్డి



తాండూరు రూరల్: బీఆర్ఎస్ తాండూరు మండల అధ్యక్షుడిగా కోటబాసుపల్లి గ్రామానికి చెందిన సిరిగిరిపేట్ వీరేందర్‌రెడ్డిని నియమించినట్లు గురువారం మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రకటించారు. గతంలో పని చేసిన గుర్రంపల్లి రాందాస్.. అసెంబ్లీ ఎన్నికల ముందు కారును వీడి కాంగ్రెస్‌లో చేరారు. నాటి నుంచి మండల అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. ఈ మేరకు తాజాగా వీరేందర్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా వీరేందర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

పెద్దేముల్: ఓ వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సందడి చేశారు. మండల పరిధి తింసాన్‌పల్లి గ్రామానికి చెందిన పగిడ్యాల శారద-నందారెడ్డి కుమారుడు మధవరెడ్డి పెళ్లి.. తాండూరు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొని నూతన వధూవరులు మాధవరెడ్డి-మోక్షితలను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పెద్దేముల్ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ప్రసాద్, బంగ్ల రఘు తదితరులు ఉన్నారు.

జెడ్పీటీసీ మంజుల..



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

తాండూరు రూరల్: మండల పరిధి అంతారం తండాకు చెందిన కారోబార్ కేతావత్ రాము, లత వివాహం గురువారం భూకైలాస్ దేవస్థానంలోని ఫంక్షన్‌హాల్లో జరిగింది. ఈ వేడుకల్లో జెడ్పీటీసీ గౌడి మంజుల పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇందులో నాయకులు గౌడి వెంకటేశం, రాజప్ప గౌడ్, ప్రశాంత్, బాలప్ప, నవీన్ ఉన్నారు.

అందుబాటులో వెయింగ్ మిషన్లు

తాండూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు ఉపయోగపడే వెయింగ్ మిషన్, కొలతల మీటర్లు గురువారం సీడీపీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. తాండూరు క్లస్టర్ కింద ఉన్న 279 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ యంత్రాలను పంపిణీ చేయనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

'పోతులూరి' వీధినాటకం ప్రదర్శన



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

కుల్కచర్ల: మండల కేంద్రంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వీధి నాటకాన్ని బుధవారం రాత్రి ప్రారంభించారు. కాగా.. వారం రోజుల పాటు నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. చాలా కాలం తర్వాత వీధి నాటకం ప్రదర్శించడంతో గ్రామస్తులు ఆసక్తిగా చూశారు.

నేడు పీఏసీఎస్ సమావేశం

కుల్కచర్ల: మండల కేంద్రం సొసైటీ మినీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని సంఘం చైర్మన్ కనకం మొగులయ్య తెలిపారు. ఈ సమీక్షకు పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్‌లు రానున్నారని పేర్కొన్నారు. కావున రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కనకం కోరారు.

మహిమాన్వితం రామలింగేశ్వరాలయం



విద్యుద్దీప కాంతుల్లో పాంబండ దేవస్థానం



గర్భగుడిలో ఉత్సవమూర్తి

భక్తుల కొంగుబంగారంగా పాంబండ ప్రసిద్ధి
- శ్రీరాముడే లింగాన్ని ప్రతిష్ఠించిన శైవక్షేత్రంగా గుర్తింపు
- రేపటి నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

కుల్కచర్ల: బ్రహ్మోత్సవాలకు రామలింగేశ్వర ఆలయం ముస్తాబయింది. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఆలయ కమిటీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచిన బండవెల్కిచర్ల శ్రీపాంబండ రామలింగేశ్వర క్షేత్రానికి.. వేడుకల సందర్భంగా దైవదర్శనం కోసం భక్తజన సందోహం తరలి రానున్నారు. దేవస్థానంలో ప్రత్యేకంగా ఏటా రెండు పర్యాయాలు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రావణమాసం ముగింపును పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. అనంతరం ఉగాదికి 11రోజుల ముందు నుంచి నిత్య కార్యక్రమాలను చేపడుతూ.. ఉగాది రోజున పంచాంగ శ్రవణంతో వేడుకలను ముగిస్తారు.

బ్రహ్మోత్సవాల వివరాలు

- శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఈ నెల 30వ తేది నుంచి ఏప్రిల్ 9వ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.
- 30వ తేది సాయంత్రం 6గంటలకు గ్రామంలోని అర్చకుల ఇంటి నుంచి ఉత్సవ మూర్తిని ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకు వస్తారు. అనంతరం రాత్రికి పల్లకీ సేవ నిర్వహిస్తారు.
- 31న రుద్ర హోమం, సర్వదర్శనం, సాయంత్రం పల్లకీ సేవ
- 1వ తేది సోమవారం శకటోత్సవం, పల్లకీ సేవ, తదితర కార్యక్రమాలు
- 2న సర్వదర్శనం, సాయంత్రం పల్లకీ సేవ, హారతి
- 3న సర్వదర్శనం, సాయంత్రం పల్లకీ సేవ, హారతి
- 4న పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం, పల్లకీ సేవ
- 5న తెల్లవారుజామున రథోత్సవం
- 6న సర్వదర్శనం, పల్లకీ సేవ
- 7న సర్వదర్శనం, పల్లకీ సేవ
- 8న అమావాస్య రోజున అగ్నిగుండాల కార్యక్రమం
- 9న ఉగాదిని పురస్కరించుకుని పచ్చడి పంపిణీ, పంచాంగ శ్రవణం. అనంతరం ఉత్సవమూర్తిని ఆలయ అర్చకుల ఇంటికి తీసుకెళ్లడంతో ఉత్సవాల ప్రక్రియ ముగింపు.

బస్‌రూట్

కుల్కచర్ల మండల కేంద్రానికి 2కిలో మీటర్ల దూరంలో పాంబండ దేవస్థానం ఉంది. పరిగి–మహబూబ్‌నగర్ నుంచి కుల్కచర్ల మీదుగా పాంబండకు చేరుకోవచ్చు. నారాయణపేట, తాండురు, కొస్గి నుంచి వచ్చేవారు దాదాపూర్ మీదుగా ఆలయానికి రావచ్చు. కుల్కచర్ల నుంచి దాదాపూర్ నుంచి ఆటోలు అందుబాటులో ఉంటాయి.

విజయవంతం చేయండి



11రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. అన్ని సౌకర్యార్థం సౌకర్యాలు కల్పించాం. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి.

– నర్సమ్మ, ఆలయ చైర్‌పర్సన్

ఉత్సవ ఏర్పాట్లు సిద్ధం



భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతంలో అన్ని ఏర్పాట్లు చేయించాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలు శోభాయమానంగా, ప్రశాంత వాతవరణంలో జరిగే విధంగా సౌకర్యాలు కల్పించాం. వేసవి నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– సుధాకర్, ఆలయ ఈఓ

ఏకశిలా పర్వతం

శ్రీ పాంబండ ఆలయానికి అత్యంత ప్రాచీనచరిత్ర ఉంది. త్రేతాయుగంలో రావణాసురుడిని సంహరించిన అనంతరం రావణ బ్రహ్మ హత్య పాప విమోచనానికై కోటిలింగాలను ప్రతిష్ఠించాలని ఋషులు, బ్రహ్మర్షులు పేర్కొనగా.. అందులో భాగంగానే పాంబండ దేవస్థానంపై శ్రీరాముడు లింగాన్ని ప్రతిష్ఠించాడని పురాణాలు చెబుతున్నాయి. అదే విధంగా లింగాన్ని అభిషేకించడానికి నీరు అవసరం కాగా.. బండపై తన బాణాన్ని సందించి, వచ్చిన నీటితో లింగాన్ని అభిషేకించడం జరిగిందని, ఆ సమయంలో ఏర్పడిన రంధ్రమే నేటి ఆలయ గుండం(కోనేరు)గా పేరుగాంచిందని చరిత్ర చెబుతోంది. స్వయంగా రాముడే లింగమూర్తిని ప్రతిష్ఠించడంతో స్వామివారిని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ ఆలయం పూర్తిగా ఒకే శిలపై నెలకొని, కిలో మీటరు దూరం ఉండటంతో ఆలయాన్ని ఏకశిలా పర్వతంగా పిలుస్తుంటారు. ఆలయం ప్రాంగణం ఉన్న ప్రదేశం ఒక రాతిలా ఉండి, పాము ఆకారంలో ఉండటంతో ఈ దేవస్థానికి పాంబండగా గుర్తింపు వచ్చింది.



పాంబండ రామలింగేశ్వర ఆలయం

రైతులకు రూ.2 కోట్ల రుణాలు

- లాభాల్లో కొనసాగుతున్న సంఘం
- 998 మంది కర్షకులకు రుణమాఫీ
- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దేముల్: వానాకాలం సీజన్‌లో రైతులకు రూ.2కోట్ల రుణాలు ఇవ్వనున్నామని పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం సంఘం కార్యాలయంలో సంఘం 46వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్యావరి మాట్లాడారు. దీర్ఘ కాలిక రుణాలు తీసుకున్న రైతులు, సకాలంలో చెల్లిస్తే 50శాతం వడ్డీ రాయితీ కల్పిస్తామని చెప్పారు. మొత్తం 1,518 మంది అన్నదాతలకు రుణమాఫీ రావలసి ఉండగా, ఇప్పటి వరకు 998 మందికి రూ.7కోట్లు వచ్చాయని, మరో రూ.5కోట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్యాంకు రూ.75లక్షల లాభాల బాటలో కానసాగుతుందని వెల్లడించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు ఎకరాకు రూ.35 వేలు రుణం ఇవ్వడంతో పాటు డీఏపీ, యూరియా ఎరువులు సిద్ధంగా ఉంచనున్నామని చైర్మన్ తెలిపారు.

బకాయి చెల్లించి, రుణాలు పొందండి

మూడేళ్ల నుంచి పీఏసీఎస్‌కు రెగ్యులర్ ఎండీ లేక ఎలాంటి పనులు ముందుకు జరగటం లేదని, ఎండీని నియమించాలని పలువురు రైతులు కోరారు. అంతే కాకుండా ఇంతకు ముందు విధంగానే సంఘంలో రుణాలతో పాటు ఎరువులు, విత్తనాలను 12 నెలల పాటు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నదాతలు సమీక్ష దృష్టికి తెచ్చారు. దీనికి స్పందించిన చైర్మన్.. రైతుల కోరిక మేరకు తప్పకుండా కృషి చేస్తానన్నారు. ఖరీఫ్ రుణాలు జూన్ మాసంలో ప్రారంభం చేస్తామని, మొండి బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించి, బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం కొత్త రుణాలను పొందవచ్చని సూచించారు. రుణమాఫీ అయిన రైతులకు చెక్కులను అందజేశామని చైర్మన్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేనేజర్ మురళీగౌడ్, పాలక వర్గం సభ్యులు గోపాల్, పద్మమ్మ, సుగునమ్మ, వెంకటప్ప, గెమ్యా, సిబ్బంది ప్రవీణ్, ఫయాజ్, పెంటప్ప, నర్సింలు, మాణెప్ప తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు



విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

మీర్‌పేట: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వనస్థలిపురం జోన్ నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జీ అన్నారు. పాఠశాలలో జరిగిన స్పెల్‌బీ జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో మీర్‌పేట నారాయణ విద్యార్థులు సత్తా చాటారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో తొమ్మిదో తరగతి సాయి సుజిత్, ఋత్విక్ ప్రథమ, పల్లవి, వైష్ణవి, సాయి నిఖిల్, శ్రేష్ఠ, త్రిజల్, పుష్పహాస్‌లు ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలని సూచించారు. ఇందులో హెడ్ శివరంజని, సీఓ మనోహర్, ఏడీ రాజేందర్, బోజిరెడ్డి, యోగేంద్ర పాల్గొన్నారు.

ఫేక్ ఫోన్ కాల్స్‌పై అప్రమత్తత అవసరం

చేవెళ్ల: మున్సిపాలిటీలో పన్ను చెల్లింపుల విషయంపై వస్తున్న ఫేక్ ఫోన్ కాల్స్‌ను వ్యాపారులు నమ్మి మోసపోవద్దని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధి వ్యాపారులకు.. కొందరు వ్యక్తులు మున్సిపాలిటీ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించలేదు వెంటనే డబ్బులు చెల్లించాలని చెబుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించాలని కోరుతూ వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దుకాణదారులు, వ్యాపారవేత్తలు ఫేక్ ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని, ఫోన్ చేసింది ఎవరో ముందుగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. నిర్ధారణ చేసుకున్న తరువాతే డబ్బులు చెల్లించాలని స్పష్టం చేశారు. పన్నులు, లైసెన్స్‌ల ఫీజులు నేరుగా మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలని వెల్లడించారు.

ప్రతివారం డబ్బులు చెల్లించండి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీను నాయక్

- వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అనేక మార్పులు తీసుకొస్తూ చివరికి ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్ ఆరోపించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధి కడియాలకుంట తండా గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం వారంవారం కూలి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే డొక్కాడని కూలీలకు ప్రభుత్వం డబ్బులు సక్రమంగా చెల్లించకపోవడం దారుణమన్నారు. కూలీలకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా పని చేసే ప్రదేశంలో అధికారులు మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లలో కూలీలను పని ప్రదేశానికి తీసుకెళ్లాలని, హాజరు కోసం ఫొటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం, కూలీలకు వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, రవి, సురేశ్, శ్రీకాంత్, సంతోష్, శారద, జ్యోతి, సీతమ్మ, శ్రీను, జానీ, బుజ్జి, సింధూ, వాలీ తదితరులు పాల్గొన్నారు.

'స్ఫూర్తి'లో నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం 2కే4 పేరిట ప్రారంభమైన నేషనల్ లెవల్ టెక్నికల్ ఫెస్ట్ గురువారం ముగిసింది. రోబోకోడ్, స్క్రాచ్ గేమ్స్, హ్యాక్‌థాన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, బ్లాక్ చైన్ టెక్నాలజీపై కాంటెస్ట్, టెక్నికల్ క్విజ్ నిర్వహించారు. వీటితో పాటు పలు రంగాల్లో పోటీ నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో మేథాశక్తిని పెంపొందించవచ్చన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 200లకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ ఎస్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్, డీన్ డాక్టర్ గిరిధర్, ప్రోగ్రామ్ కన్వీనర్స్ ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు, డాక్టర్ రమేశ్‌రావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్స్ మహ్మద్ ముస్కిన్ అలీ, ఖలీల్ అహ్మద్, మహ్మద్ అఫ్జల్, సిబ్బంది పాల్గొన్నారు.



ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

రైతు సంక్షేమమే లక్ష్యం



ఆర్థిక సహాయం అందజేస్తున్న భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: రైతు సంక్షేమమే ధ్యేయంగా సేవలందిస్తున్నామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ భరత్‌కుమార్ అన్నారు. సంఘంలో సభ్యత్వం ఉండి, మృతి చెందిన సభ్యుల కుటుంబాలకు సంఘం తరఫున రూ.25వేల నగదు అందజేస్తున్నామని తెలిపారు. తారమతిపేట గ్రామానికి చెందిన ఎం.మల్లయ్య జనవరి 8న మృతిచెందగా.. ఆయన భార్య అంజమ్మకు కార్యాలయంలో చైర్మన్ భరత్‌కుమార్ చేతుల మీదుగా గురువారం రూ.25వేలను అందజేశారు. సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మరమ్మతుకు మోక్షం ఎప్పుడు?

కంకరతేలి అధ్వానంగా మారిన బీటీరోడ్డు

దోమ: గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు గుంతలు పడి, వాహనదారులకు అసౌకర్యంగా మారాయి. మండల పరిధి గొడుగోనిపల్లి గ్రామం నుంచి దొంగ ఎన్కేపల్లికి చేరుకునే బీటీరోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉంది. గొడుగోనిపల్లి వయా దోర్నాల్ పల్లి, దొంగ ఎన్కేపల్లి చేరుకోవాలంటే సుమారు 5 కిలో మీటర్ల దూరం ఉందని, రోడ్డు పూర్తిగా కంకర తేలి ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది ఉందని బాధిత గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే స్పందించి, రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



గొడుగోనిపల్లి-దొంగ ఎన్కేపల్లి బీటీరోడ్డు దుస్థితి

ఉపాధికి ఊతమేదీ?

- కూలీలకు ప్రోత్సాహం కరువు
- పని జరిగేచోట కనిపించని రక్షణ చర్యలు
- కొన్ని పంచాయతీల్లోనే కొనసాగుతున్న ఉపాధి
- ఏపీఓ లేక.. రెండేళ్లుగా ఇన్‌చార్జితోనే పనులు



ఆలూరులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

చేవెళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు ప్రోత్సాహం కరువయింది. గ్రామాల్లో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం కింద వంద రోజులు ఉపాధి కల్పించాలి. కానీ ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కూలీలకు ఆ దిశగా ప్రయోజనం చేకూరడం లేదు. గతంలో అధిక ఉష్ణోగ్రతలో పని చేస్తున్నందుకు కూలీలకు వేసవి భత్యంతో పాటు తదితర సౌకర్యాలు కల్పించేవారు. కానీ ప్రస్తుతం సౌకర్యాల సంగతి ఎలా ఉన్నా.. కనీసం వేసవి అలవెన్స్ కూడా ఇవ్వడం లేదని కూలీలు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజన్ నాలుగు మండలాల్లో ఉపాధి పనుల తీరు అధ్వానంగా ఉందని, పనిచేసే చోట సౌకర్యాలు ఏర్పాటు చేయకపోగా.. మూడు నెలలుగా కూలి డబ్బులు చెల్లించకుండా పనులు చేయిస్తున్నట్లు పలువురు కూలీలు పేర్కొనడం గమనార్హం.

కొన్ని గ్రామాలకే పరిమితమైన పనులు

మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 4 వేల మందికి జాబ్‌కార్డులు ఉండగా.. ఉపాధిహామీ పనులు మాత్రం కొన్ని గ్రామాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం మండలంలో 400ల మంది కూలీలు మాత్రమే పనులు చేస్తున్నారు. అధికారులు కూలీలు పనులకు రావటం లేదని, అందుకే పనులు జరగటం లేదని పేర్కొనగా.. పనులు జరిగే గ్రామాల్లో కూలీలు పెద్ద సంఖ్యలోనే హాజర వుతున్నట్లు సమాచారం. పనులు చేసినా సకాలంలో డబ్బులు రావటం లేదని కూలీలే చెబుతున్నారు. గతంలో పని చేసిన వారికి సంబంధించి జనవరి నెలలో కూలి డబ్బులు వచ్చాయని, అప్పటి నుంచి పనిచేస్తున్న వారికి ఇప్పటి వరకు డబ్బులు రాలేదని తెలుస్తోంది. కానీ.. ప్రభుత్వం నుంచి డబ్బులు ఎప్పటికైనా రాకపోతాయా అనే నమ్మకంతో కూలీలు పనులు చేసుకుంటూ పోతున్నారు.

కనిపించని సౌకర్యాలు

ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేసే కూలీలకు పనిచేసే చోట నీటి సౌకర్యం, ఎక్కువగా ఎండ ఉన్న సమయంలో సేద తీరేందుకు అందుబాటులో టెంట్ వేయాలి. ఏదైనా ప్రమాదం జరిగితే కూలీలకు అక్కడే ప్రథమ చికిత్స చేసేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్న నిబంధనలు ఉన్నాయి. వీటితో పాటు కూలీలకు అవసరమైన పనిముట్లు కూడా ఉపాధి పనుల్లో అందించాలి. కానీ వీటిలో ఏ నిబంధనలు సంబంధిత అధికారులు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఉపాధి కల్పించి, వేతనం వారి ఖాతాలో వేయటం మాత్రమే జరుగుతున్నట్లు పలువురు పేర్కొన్నారు. పనులు లేకపోవటంతో ఈ పనులు చేసుకుంటున్నామని, వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, అయినా ఉపాధి కోసం పని చేస్తున్నామని కూలీలు వాపోయారు. అధికారులు మాత్రం ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేస్తున్నామని చెబుతున్నారు. వచ్చే నెల నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం.. కొత్త పనులు చేపడతామని స్పష్టం చేస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన ఏపీఓ లేకపోవటంతో ఈసీకి ఇన్‌చార్జి ఇచ్చారు. ఈసీ రాజశేఖర్ మండలంలోని ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్నారు. కానీ ఆయన ఎప్పుడు అందుబాటులో ఉండటం లేదని కిందిస్థాయి సిబ్బంది ఆరోపించారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణ కూడా చేయటం లేదని, కొత్త ఏపీఓను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి



మండలంలో ఉపాధి పనులకు ఇప్పుడిప్పుడే కూలీలు వస్తున్నారు. కూలీల సంఖ్య ఇంకా పెరగాల్సి ఉంది. వచ్చే నెల నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం వేసవి కాలంలో పనులు ఎక్కువగా అవసరం ఉంటాయి. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పనులు కల్పిస్తామని, కూలీలు ముందుకు రావాలని కోరుతున్నాం. పూర్తిస్థాయిలో కూలీలు రావటం లేదు. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కూలి డబ్బులు, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం. మండల ఏపీఓను కూడా ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులను నివేదిస్తాం.

– హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల